

# అగ్రహారం కథలు

వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

## పెద్దావిడ ప్రయాణం

' ఏవమ్మా అక్కయ్యా! ఇవ్వాళే కదూ పెద్దావిడ ప్రయాణం!' రాముడు గారి రెండో కోడలు సరస్వతి వీధి గుమ్మంలో ముగ్గు వేస్తున్న పెద్ద కోడలు ప్రభావతిని అడిగింది.

'అవునేవ్! మర్చేపోయాను సుమా! అయితే ఇవ్వాళ పెందరాడే మడి కట్టుకోవలసిందే లేకపోతే పని తెమలదు' అని బాల్చీ, చీపురు తీసుకుని కాఫీల వసారా లోకి పరుగెత్తింది ఆవిడ.

నలుగురు కొడుకులూ, ఆరుగురు కూతుళ్ళూ, మనవలూ, మనవరాళ్ళతో బీరపాదులా కళకళలాడే సంసారం, రాముడు గారుగా పిలవబడే రామావధాన్లు గారిది. అగ్రహారంలోని పెద్ద ఇళ్ళలో అది ఒకటి. పెద్ద కొడుకులు ముగ్గురూ ఇక్కడే ఉండి పాడీ పంటా చూసుకుంటారు, నాలుగో అతను మాత్రం విజయవాడ లో ఉద్యోగం చేస్తున్నాడు. ముగ్గురు పెద్ద ఆడపిల్లలనీ చుట్టుపక్కలే ఇచ్చినా తరవాతి ఇద్దరూ ఢిల్లీ లోనూ, ఆఖరావిడ కాకినాడ లోనూ ఉంటారు.

చామనచాయలో కొండంత అమాయకత్వాన్నీ రవ్వంత చాదస్తాన్నీ, పిలవకుండానే వచ్చి చేరే చిరుకోపాన్నీ, అంతులేని ప్రేమాభిమానాలనీ, ముఖ్యంగా ఎంత తోడినా తరగకుండా, ఊరే చెలమ లోని నీటిలాంటి పుట్టినింటి మమకారాన్నీ కలిపి, గొచీ పెట్టి చీర కడితే ఆ రూపం సుందరమ్మ గారు. ఆ ఇంటి పెద్దకూతురు, ఆవిడే పెద్దావిడ. మూడంటే మూడే కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో అగ్రహారనికి జమీందారైన సుబ్బారావు గారి కోడలు ఆవిడ. పాడీ, పంటే కాదు, ఒక ధాన్యం మిల్లు కూడ ఉంది వాళ్ళకి. దగ్గర ఉండడం వల్ల నెలకు కనీసం ఒకసారైనా ఆవిడ ఏదో ఒక వంకన పుట్టింటికి రావలసినదే, వెళ్ళలేక, వెళ్ళలేక వెళ్ళవలసినదే ఆ ప్రహసనం చూడవలసినదే కానీ చెప్పనలవి కాదు. ఈరోజు ఈ ప్రయాణానికి మాత్రం పెద్ద తేడా ఏముంది?

బారెడు పొద్దు ఎక్కితే కానీ నిద్ర లేవదు ఆవిడ, కాఫీలవ్వగానే 'ఏమేవ్! ప్రభావతీ! ఇవ్వాళ వంట నేనే చేస్తాను. నేను వండి పెడితే నా తమ్ముళ్ళు తింటూ ఉంటే నాకు సంతోషం" అందావిడ.

ఇది ముందే తెలిసిన ప్రభావతి 'అలాగే వదినా! పొయ్యిలో నిప్పు వేసే ఉంచాను. మీరు గబగబా మడి కట్టుకోండి మరి" అంది.

'నా స్నానమెంతసేపే? నీది మరీ చోద్యం కాకపోతే? ఇలా వెళ్ళి, అలా రానూ? 'మరదలి తో సరసమాడింది ఆవిడ. 'నే వచ్చేలోపున ఎసరు కడిగి పెట్టు, అలాగే సరస్వతి ని కూరల పని చూడమను' అని పురమాయించింది.

'సరే! తప్పుతుందా! ' అనుకుని, పైకి మాత్రం 'అలాగేలెండి! మీరు ముందో రొండు చెంబులు పోసుకుని రండి, ఆనక మీ తమ్ముళ్ళే ముందు ఆకలంటారు' అంది.

ఆవిడ వంట వండే ప్రక్రియ మరీ గొప్పగా ఉంటుంది. రెండు పొయ్యిలూ రాజేసి, పెద్ద ఇత్తడి గిన్నె మాడి పోకుండా ఉండడానికి దాని అడుగున మట్టి రాసి, ఎసరు కాగాకా, కడిగి ఉంచిన బియ్యం దాంట్లో పోసి, పక్కన మరో చిన్న పొయ్యిమీద కమ్మగా వేయించిన కందిపప్పు ఉడికించడం లాంటివి పెద్ద మరదలు చేస్తే, పచ్చిమిరపకాయ దగ్గరనించీ వంటకి కావలసిన సమస్తమైన కూరలూ తరిగి చిన్న మరదళ్ళిద్దరూ అందిస్తే, రెండో ఆవిడ భూగోళమంత రుబ్బుగుంటలో కొబ్బరి పచ్చడి రుబ్బడానికి ఉపక్రమించింది. ఇలా అందరిమధ్యనా తిరుగుతూ, వాళ్ళు అందించిన సహాయంతో మొత్తానికి వంకాయ కూర, కొబ్బరి పచ్చడి, పప్పూ, ముక్కల పులుసులతో బ్రహ్మాండంగా వంట తయారయింది. ' మా సుందరం వంటేమిట్రా? ఘుమఘుమ లాడిపోతోంది! ' అంటూ రాముడు గారు రానే వచ్చారు. ఆవిడ వడ్డన ఇంకా గమ్మత్తుగ్గా ఉంటుంది. మడి కట్టుకోవడానికి బద్ధకించే వాళ్ళంటే ఆవిడకి మహా చిన్న చూపు. పైగా మొదట కూర్చున్న వారికి ఎక్కువ వడ్డించేసి చివరి బాచ్‌లో వాళ్ళకి కేవలం పులుసు మాత్రం మిగలడం కూడ కద్దు. అందుకే స్కూల్ నుంచి వచ్చే పిల్లలకోసం మరదళ్ళు ముందే తీసి ఉంచుతారు. ఇక పాచివాళ్ళ ఆకుల్లో గుండ్రటి టెన్నిస్ బంతులలాంటి పచ్చడి ముద్దలూ, - ఆకుపచ్చగా, ఎర్రగా ఉండే కూరముద్దలూ అల్లంత దూరంనుంచీ పడతాయి, మడిగా వడ్డించే వాళ్ళను ముట్టుకోకూడదు కదా మరి! పొరపాటునైనా తగులుతారేమోననే అంత జాగ్రత్త.

మగవాళ్ళ భోజనాలు అయ్యాకా, మరదళ్ళతో కలిసి తనూ భోజనం చేసి చెయ్యి కడిగిన మరుక్షణం పెద్ద స్టీల్ చెంబుడు మంచి నీళ్ళు తాగేసి తలుపులన్నీ బిగించేసి, చిమ్మ చీకటిగా ఉన్న గదిలో దాదాపు రెండు గంటల పాటు కునుకు తియ్యడం ఆవిడ అలవాటు. బ్రహ్మ దేవుడు అడ్డం వచ్చినా సరే, అది మానుకోవడం మాత్రం కుదరదు. దాని తరవాతే ప్రయాణమైనా, మరేదైనా.

నిద్ర లేవగానే రెండు టీ చుక్కలు గొంతులో పడితే కానీ, బండి కదలదు కదా! అదయ్యాకా ముఖం కడుక్కుని, శుభ్రంగా నూనె రాసి ముడి వేసుకుని కళ్ళకి లావుగా, దట్టంగా కాటుక పెట్టుకుని, నుదిటిన ఎర్రటి కుంకుమ దిద్దుకొని, నీలానికి ఎర్రటి అంచున్న మధుర చుక్కల చీర, తెల్లటి కుట్టుపూల జాకెట్ వేసుకొని, తన బట్టలన్నీ మేనకోడలు అల్లి ఇచ్చిన వైరు బుట్టలో సర్దుకొని, దాని రెండు హేండిళ్ళకీ కలిపి ఎర్ర మొలతాడు కట్టుకొని ఆవిడ అరుగుమీదకి చేరేసరికి ఇంటిల్లిపాదీ అక్కడే తయారుగా ఉన్నారు. కొబ్బరికాయ గుదులూ, మావిడికాయలూ, పనసపండూ, అరటిగెలా, ఇలాంటి చాలా సామనులు అక్కడకి అంతకు ముందే చేరి ఉన్నాయి. 'పెద్దత్తయ్యకు చాప వెయ్యండ్రా!' పెద్దతమ్ముడు సోమేశం పిల్లల్ని ఆదేశించాడు.

'ఒరే! కేశవా! వర్జ్యం చూసావ్రటా? ' చాప మీద చతికిలపడుతూ అడిగిందావిడ.

'ఆహా! అంతా దివ్యంగా ఉందే అక్కా, విదియా, బుధవారం, రాహుకాలం కూడా లేదు' పంచాంగం తిరగేస్తూ అన్నాడు అతను.

'అవునమ్మా! సుందరం! ముహూర్తం చక్కగా ఉంది' అన్నారు రాముడు గారు కూడ..

పొలానికి వెళ్ళిన బండి రావడమే తరువాయి ఇంక ప్రయాణానికి. ఇంతలో ఏదో గుర్తు వచ్చినట్టుగా ఆవిడ అంది.

'పొద్దున్నే నూతి గట్టుమీద కాఫీ తప్పేళా తొలుస్తూ, జానకమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకొంటూ, నా చెయ్యి పట్టుకుని ఏమందో తెలుసా? ఏమిటో వదినా! మీరు వచ్చినట్టూ లేదూ, వెళుతున్నట్టూ లేదూ, సరదాగా మేము ఉన్న ఈ నాలుగు రోజులూ ఉంటారనుకున్నాను. అని ఎంతో ఇదైపోయింది. అవును, ఎలాగూ సందె పడింది కదా! బండీ రాలేదు ఇంకా! దాని మాట మాత్రం ఎందుకు కాదనాలి? వెర్రి మొహం అడగక అడగక అడిగింది. ఈ ఒక్కపూట ఉంది రేపు వెళ్ళనేవిట్రా?' అంది.

'అదేవిటమ్మా? దానికి అడిగేదేముంది? నీకెప్పుడు వెళ్ళాలనిపిస్తే అప్పుడే వెళుదువుగానీ! పదండ్రా ఇంట్లోకి! 'అన్నారు రాముడు గారు.

ఆమాట తను ఎప్పుడందో తెలియక కంగారు పడింది ఆఖరు మరదలు. ఇంకేం! అందరూ ఇంట్లోకి నడిచారు. మర్నాడు తదియా గురువారం, ముహూర్తానికేమీ లోటు లేదు కానీ మధ్యాహ్నం భోజనాల వేళే ఆవిడ అంది మన మాధవుడి మూడో కొడుకు వెర్రి వెధవ ' పెద్దత్తయ్యా! నువ్వు ఈసారి ములగకాడల పిండి పెట్టిన కూర వండనే లేదూ అని అడిగాడే, నిరుడీనాటికి వాడికి సరిగ్గా మాటలయినా రావు, పాపం వాడికి రేపు అది వండి పెట్టి వెళ్ళిపోతాను, మరి ఇవ్వాల్టి వంట అయిపోయింది కదా! 'అమాయకంగా అన్న ఆవిడ మాటలకి అందరూ తలలూపారు ముసి ముసి నవ్వులతో. 'వెధవా! నిన్నే అడక్కూడదట్రా! నీ కోసం ఇంకో రోజు ఉండాల్సి వస్తోంది!' అని వాడిని ముద్దుగా విసుక్కుంటుంటే మరదళ్ళు నవ్వు ఆపుకోలేక అవస్థ పడ్డారు.

మర్నాడు పిండి పెట్టిన కూర అయ్యింది కానీ ప్రయాణం అవ్వలేదు. 'బొత్తిగా చవితి నాడు ప్రయాణమేమిటే అక్కా? ' అన్నాడు కేశవుడు. నిజమే కదా! అలా వాయిదా పడింది ఇంకోసారి.

మరునాడు పాపం ఆవిడ వెళ్ళిపోయేదే కానీ పక్కింటివాళ్ళ పిల్ల పెద్దదైందనీ, 'పార్వతీ దేవి లాంటి పెద్ద ముత్తయిదువవి, మీరు వచ్చి హారతి ఇచ్చి పాట పాడితే మాకు ఆనందం, పిల్లకి ఆయుర్దాయం అంటే ఎలా కాదనడం?' అలా మంగళ హారతినీ, పేరంటపు శనగలనీ తీసుకుని పంచమి వెళ్ళిపోయింది. షష్టి నాడు ప్రయాణం తలపెట్టేందుకే కుదరదాయె. సప్తమి నాడు బండి పెద్దపాలానికి వెళ్ళింది, బండి లేని రోజుల్లో అక్కరకు వచే రిక్షా వాడికి కబురు పెట్టమని తమ్ముడికి చెప్పడమే మర్చిపోయింది ఆవిడ. 'పోనీ నాకు తోచకపోయింది సరే, మీకైనా తోచద్దా? ఒక్కళ్ళూ చెప్పలేదు, అయినా నేను గుమ్మం దిగి వెళ్ళిపోవడం మీకెవ్వరికీ ఇష్టం ఉండదు' అని వాళ్ళనే చీవాట్లు వేసిందావిడ. అష్టమి నాడు వెళ్ళి అష్ట కష్టాల పాలవ్వడం కంటే, ఊరుకోవడం ఉత్తమం కదా. రాములవారి పుట్టినరోజైనా సరే మరి నవమి నాడూ ప్రయాణం పెట్టుకోరు కదా ఎవ్వరూనూ. అందుకే నెమ్మదిగా నవమీ వెళ్ళిపోయింది.

'ఇదిగో ఏమ్రా! దశమీ ఏకాదశుల్లో ఏదో ఒక మంచి రోజు చూసి ముహూర్తం పెట్టండి. అక్కడ లంకంత కొంపా, పాడీ, పిల్లలూనూ. ఇక్కడ ఇన్నేసి రోజులు ఉండమంటే మీకు బాగానే ఉంటుంది, నాకు కుదురుతుందా మరి? ' అన్న ఆవిడ మాటలకి నవ్వుతూ తలలూపారు అందరూ. దశమో, ఏకాదశో ఇంకా తెలియాలి కదా!

దశమి నాడు చక్కని టైము చూసుకుని అరుగుమీదకి వచ్చేసరికి, ఒంటి బ్రాహ్మడి శకునం, ఆవిడకి ఒంట పట్టదు, లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కుని, ఓ గ్లాసుడు నీళ్ళు నోట్లో పోసుకుని వచ్చిన పది నిమిషాలకి వచ్చాడు రిక్షావాడు. 'అదేటండీ సుందరమ్మగోరూ! అప్పుడేనా ఎల్లిపోడం? నాన్నగారిని చూడండే ఎలా బెంగెట్టుసుకున్నారో పాపం! ఈ పొద్దుండి రేపెల్లకూడదేంటండే? సిటికే లో దింపేత్తాను'. అన్నాడు. అవును మరి, ఈవిడని దింపి వెళ్ళడానికి సినిమా టైము ఒప్పుకోదు మరి. తెలుసున్న బలహీనతను వాడుకుంటే మంచిదనీ అతనికీ తెలుసు .

'చాల్లేరా! పెద్ద చెప్పొచ్చావ్! నేను ఇక్కడే కూర్చుంటే అక్కడ ఇల్లూ, వాకిలీ గొడ్డూ, గొదా ఎమైపోతాయి? ' అని పైకి అందే కానీ, వెంటనే, 'అవున్రా సోముడూ! మనం పెద్దగా చూడలేదు కానీ, నాన్న పొద్దున్నించీ దిగులుగానే ఉన్నారు, పెరుగు లోకి అన్నం మారు

కూడ వేసుకోలేదు!, కన్నపిల్లలమైన మనకంటే వాడే నయం. పోనీలే! పెద్దాయన మనసు బాధపెట్టి నేను బావుకునేదేముంది? రేపే వెళతాన్లే!' అంటూ లోపలకి నడిచే లోగానే రిక్షా వాడు తుర్రుమన్నాడు.

మర్నాడు ఆవిడ కొడుకులిద్దరూ సైకిల్ వేసుకుని వచ్చేసారు. 'అమ్మా, నువ్వు తొందరగా వస్తావో లేక తాతయ్యగారింట్లోనే ఉండిపోతున్నావో కనుక్కోమన్నాడు నాన్న' అంటూ. దానితో ఆవిడకి అభిమానం పొడుచుకు వచ్చింది.

'చూసావా! నాన్నా! మీ అల్లుడి ప్రతాపం! నా పుట్టింట్లో నేను నాలుగు రోజులు ఉండతగనా? నువ్వే చెప్పు 'అని జర జర కారుతున్న కన్నీళ్ళని చీర చెంగుతో ఒత్తుకోసాగింది.

'అదేమిటమ్మా?కన్నీళ్ళెందుకూ ఈమాత్రానికి? నే కబురు పెడతాగా అల్లుడికి. ఊరుకో! 'అన్నారాయన అనునయంగా.

'అవునే అక్కా! బావ సంగతి మనకి తెలియందేముంది చెప్పు? తాటాకు మంటలాంటి కోపం అంతే! ' సమాధానపరిచారు తమ్ముళ్ళు.

తాతయ్యగారింటికి దాదాపు రెండు నెలల తరవాత వచ్చారని కొడుకులని కూడా ఆ రోజు ఉంచేసి, మరునాడు ద్వాదశి దగ్ధయోగం కనక ఆ రోజు కాకుండా, త్రయోదశి నాడు ఇక తప్పని పరిస్థితిలో ఆవిడ రిక్షా లోనూ, కొడుకులిద్దరూ సైకిల్ మీదా ప్రయాణం అయ్యారు.

'అదేమిట్రా! మీరందరూ అలా దీనంగా మొహాలు పెట్టుకుంటే ఎలా వెళ్ళగలను చెప్పండి? మన సోముడు కూతురు సీతమ్మ పెళ్ళికి ఇంక రెండు నెలలేగా ఉంట! వినాయకుడిని పెట్టిన్నాడు పసుపు కొట్టడానికి పెద్ద మేనత్తని నేను ఉండద్దూ! వినాయకుడిని పెట్టేనాటికి వచ్చేస్తాగా! 'అంటూ రిక్షా ఎక్కుతున్న ఆవిడ మాటలకి నవ్వకుండా ఉండలేకపోయారు వాళ్ళందరూ, ఎందుకంటే సీతమ్మ పెళ్ళికి వినాయకుడిని పెట్టడానికి అప్పటికి ఇంక పదిహేను రోజులే టైముంది మరి!

